
**ఒకరి జీవితాన్ని ఒకరు శాసించకూడదు ఎవరి జీవితాన్ని వారే మలుచుకోవాలి అదే సార్థకత**

**గతవారం తరువాయి**

ఇది జరిగింది ఇరవై ఏళ్ళనాడు. శ్రీధర్ గురించిన వార్తలు అప్పుడప్పుడూ తెలుసుకుంటూ వుండేవాడు రాంచంద్. కష్టపడుతూ, స్కాలర్‌షిప్‌ల సాయంతో, ట్యూషన్లు చెప్పుకుంటూ మెడిసిన్ చదివాడు...చదువు పూర్తయ్యాక మారుమూల కుగ్రామాల్లో, గిరిజన ప్రాంతాలలో కొన్నాళ్ళు ప్రాక్టీస్ చేశాడు... స్పెషలైజేషన్ కోసం సీట్ వస్తే దేశం వదలి విదేశాలకి వెళ్ళిపోయాడని, ఏ దేశం వెళ్ళాడో రాంచంద్‌కి తెలియదు. అంతే.



మొదట్లో కొద్ది సంవత్సరాల్లోనే రాంచంద్‌కి తెలిసిపోయింది శ్రీధర్ తనని మించిమ మొండివాడని... తిరిగిరాడని. అప్పుడప్పుడూ సమయం దొరికినప్పుడు... బిజనెస్ వ్యవహారాలలో మనస్సుకి కాస్త తెరిపి దొరికినప్పుడు లలడికి ఓ అలవాటుంది. తన గదిలో ప్రపంచ పటం మీద వున్న రంగురంగుల బటన్స్ వంక చూడడం. ప్రతి బటన్ ఒక పరిశ్రమకి చిహ్నం. అవి డజన్ల కొద్దీ అన్ని ఖండాల్లోనూ వున్నాయి— ఆసియా, ఆఫ్రికా, నార్త్ అమెరికా, సౌత్ అమెరికా, ఫార్ ఈస్ట్, యూరప్, మిడిల్ ఈస్ట్...ఎన్నో దేశాల్లో వున్నాయి ఆ బటన్స్... ఆ పరిశ్రమలు. అందువల్లనే ఇంటర్నేషనల్ బిజినెస్ కమ్యూనిటీలో ఇండియన్ బిజినెస్‌మన్ రాంచంద్ ప్రముఖుడు. అతడు టాటాలకి, బిర్లాలకి వారసుడు. వారిని మించినవాడు! అయితే ఏం లాభం? నిట్టూర్చాడు రాంచంద్.

చేతులు తుడుచుకుంటూ నవ్వుతూ వచ్చింది కాథరిన్. ఆమెని చూసేసరికి ఈ లోకంలోకి వచ్చాడు.

"మీకు బోరుకొట్టలేదనుకుంటాను మామగారూ? పదండి. కన్సల్టింగ్ రూములోకి వెళ్దాము. టెస్ట్ రిపోర్టులూ, స్కాన్ రిపోర్టులూ అన్నీ వచ్చేశాయి" అంది నవ్వుతూ. పేద న్యూయార్కర్స్ ఉధృతం బాగా తగ్గింది. ఇంకా ఎదురుబదురుగా ఉన్నారు పేషంట్స్. ఆమె నీలం రంగు కళ్ళు నిర్మలంగా మెరిశాయి. ఆమె సన్నటి చేతి వేళ్ళు సెన్సిటివ్‌గా, మృదువుగా వున్నాయి. ఆరోగ్యంతో మిసమిసలాడుతోంది. ఆత్మ విశ్వాసంతో ఆమె వ్యక్తిత్వం పరిపూర్ణమైనది. ఈ పిల్ల తన కొడుక్కి తగ్గ భార్య అనుకున్నాడు రాంచంద్.


శ్రీధర్ రిపోర్టుని నిశితంగా పరిశీలిస్తున్నాడు. తలెత్తి చూసి నవ్వి అన్నాడు, "ప్లీజ్ కూర్చోండి డాడీ. ఒక్క నిముషంలో వస్తాను."

కూర్చుని చుట్టూ చూశాడు. అది నీట్‌గా వున్న చిన్నగది. ఎలక్ట్రానిక్ ఎక్విప్‌మెంట్ ఏదోవుంది. ఓ చిన్న పర్సనల్ కంప్యూటర్ వుంది. జబ్బులని పసిగట్టటానికి కావలసిన పరికరాలన్నీ వున్నాయక్కడ. ఆ గదిలో ఎఫిషియన్సీ వుంది...కాన్ఫిడెన్స్ వుంది...నో నాన్సెన్స్ ఆఫీస్ గది అది!

శ్రీధర్ ముఖంలో మార్పు వచ్చింది. కొద్దిగా చిట్లించాడు.

"డాడీ! ఇది బాడ్ న్యూస్. అదృష్టవశాత్తూ ఎర్లీ స్టేజ్‌లో వుంది కాబట్టి, కలవరపడవలసిన పనేం లేదు. అది శుభవార్త. మేము ఆపరేట్ చేసి ఆ గ్రోత్‌ని తీసివేస్తాము."

ఓకే అన్నట్లుగా తలాడించాడు రాంచంద్. ఈ ముసలి శరీరం పని అయిపోయిందన్న మాట! అన్నింటిలోకీ ప్రమాదకరమైన జబ్బుతో వున్నాది. కోట్లాది డబ్బు తను ఛారిటీకి ఇచ్చాడు. అది ఇతర మనుషులలో రోగాల్ని నయం చేయడానికి, మళ్ళా వారు జీవించే



అవకాశం కలగజేయడానికి...ఇప్పుడు రాంచంద్‌కి కావాలి ఇతరుల దయా దాక్షిణ్యాలు, సానుభూతి, అబ్సర్డ్!! అతడికి ఎవరి దయా ఎప్పుడూ అవసరం లేదు. అవసరం వుండకూడదు కూడా.

ఓ డేట్ నిర్ణయించిన తర్వాత రాంచంద్ ఇంటికి వెళ్ళిపోయాడు. ఆ రాత్రి అందరూ కలిసి భోంచేద్దామని నిర్ణయించుకున్నారు.

వాళ్ళని రాంచంద్ '21' క్లబ్‌కి డిన్నర్‌కి తీసి కెళ్ళాడు. రాంచంద్, శ్రీధర్ ఫార్మల్ టక్సెడోలో వున్నారు. కాథరిన్ సింపుల్‌గా వున్న ఈవెనింగ్ గౌన్ వేసుకుని వుంది. సన్నటి గోల్డ్ చెయిన్ మెడకి వుంది. పిల్లలిద్దరూ నీట్‌గా వున్నారు. లిటిల్ రామూ చిన్ని బౌటైతో క్యూట్‌గా వున్నాడు.

వీళ్ళు భోజనాలు చేస్తున్నప్పుడు తనకి తెలిసిన ఎందరో రాంచంద్‌ని పలకరించారు. వాళ్ళలో ఎందరో సెలబ్రిటీలు వున్నారు. హాలీవుడ్ స్టార్స్ వున్నారు. ప్రఖ్యాత రచయితలున్నారు. మల్టీ మిలియనీర్ ప్లేబోయ్స్ వున్నారు. అందరితో జోకులు వేస్తూ షాంపేన్ తాగుతూ, పిల్లలతో రిడిల్స్ వేస్తూ గడిపాడు రాంచంద్. మరపురాని సాయంత్రం అది. తన జీవితంలో ఏనాడూ అంత సంతోషంగా గడపలేదు.

కారులో శ్రీధర్ ఇంటి దగ్గర దింపాడు వాళ్ళని. జేబులోనుండి చాలా ఖరీదైన డైమండ్ నెక్లెస్ టిఫనీ షాపులో కొన్నది కాథరిన్‌కి ఇచ్చాడు. సంకోచంతో కాథరిన్ అంది. "మామగారూ, నేను నగలు ఎక్కువగా పెట్టుకోను. నాకు జూవెలరీ మీద అంత ఇష్టం వుండదు. పైగా మేము బిజీగా వుండటం వల్ల అవకాశం వుండదు. మీరు చూశారుగా" అంది.

"మన లిటిల్ జానకి కోసం వుంచు కాథరిన్. పెద్దయ్యాక పెట్టుకుంటుంది జేన్" అన్నాడు.


నిజమే కాథరిన్ చెప్పినది. ఆమె వేసుకున్న గౌన్ సింపుల్‌గా వుంది. ఎలిగెంట్‌గా వుంది. కొద్దిగా లిప్‌స్టిక్, సన్నటి గోల్డ్ చైన్ అంతే! హాస్పిటల్ యూనిఫారమ్‌లో ఆమె ఎక్కువ సుఖంగా వుంటుందేమోననిపించింది. నీకు కూడా నా కొడుకులాగేనే సింపుల్ లైఫ్ అంటే ఇష్టమా మైడియర్ కాథరిన్ అనుకున్నాడు. వాళ్ళిద్దరూ హాపీగా వున్నారు. అరమరికలేం లేకుండా డాక్టర్స్‌గా ప్రజాసేవ చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారిద్దరూ. వారి ఆలోచనల్లో తేడాలేదు మనుషులకి ఆరోగ్యం ప్రసాదించడం తప్ప. వాళ్ళు మనుషులకి అత్యంత విలువైన పదార్థాన్నిస్తున్నారు. అది ఆరోగ్యం.. జీవితం... ప్రాణం తనేం ఇవ్వగలడు. డబ్బు... నగలు ఫాక్టరీస్... ఇండ స్ట్రీస్... ప్లేన్స్...ప్రాణం లేని వారికి ఇవన్నీ ఎందుకు. యూస్‌లెస్? తనకి ఇన్నాళ్ళూ తెలియని జీవిత రహస్యమేమిటో ఈ యువ దంపతులకి తెలిసిన ట్లుంది. సీక్రెట్ ఆఫ్ హాపీనెస్. జీవితంలోని కాంప్లెక్సిటీతో వీరు తడబడటం లేదు. తరతరాల నుండి జరుగుతున్న తప్పే తన విషయంలోనూ జరిగింది. యువతరాన్ని ఎల్లప్పుడూ అంచనా వేయడంలో పెద్ద వాళ్ళు పప్పులో కాలేస్తారు. తనూ అంతే చేశాడు. మెల్లగా నిట్టూర్చాడు రాంచంద్.

ఇంటికి చేరాక ఆ రాత్రి నిద్రించలేదు రాంచంద్. బెడ్ మీద నిద్రలేమితో తల్లడిల్లాడు. ఆలోచనలతో తల వేడెక్కిపోయింది. కాన్సర్ సెల్స్ తన శరీరంలో వృద్ధి చెందుతున్నాయి అన్న సంగతి అతడికి ప్రతి క్షణం పీడించింది—క్షణ క్షణం పెరుగుతూ అవి తన శరీరాన్నంతా ఆక్రమిస్తున్నాయని...లోపలి శరీర భాగాల్ని తినేస్తూ...లివింగ్ సెల్స్‌ని నాశనం చేస్తూ కాన్సర్ సెల్స్ వ్యాప్తి చెందుతున్నాయి. డెబ్బై రెండేళ్ళుగా తన మనస్సుకి సేవచేసిన వృద్ధ శరీరం ఈ యుద్ధంలో ఓడిపోతోంది. అన్ని విధాలా నిర్ణయాలు తీసుకోవలసిన సమయం వచ్చిందని గ్రహించాడు రాంచంద్. సమస్యలు పరిష్కరించాలి. డెసిషన్స్ తీసుకోవాలి! జీవితంలోని అతి ముఖ్యమైన డెసిషన్ ఇప్పుడు తీసుకోవలసిన అవసరం వుంది. టైమ్ వచ్చేసింది.

మరునాడు వాల్డార్ఫ్ ఆస్టోరియా గ్రాండ్ బాల్ రూమ్‌లో పెద్ద పార్టీ ఇచ్చారు. న్యూయార్క్ ఫ్రెండ్స్ ఆ పార్టీకి అటెండ్ అవడానికి ప్రపంచంలోని అన్ని మూలలనుంచి అతిథులు వచ్చారు. లా గార్డియా, జె.ఎఫ్.కె. ఎయిర్ పోర్టులలో విమానాల రద్దీ పెరిగింది. ఆ పార్టీలో హెన్రీ ఫోర్డ్ IV, నెల్సన్ రాక్‌ఫెల్లర్, జాన్ కెన్నెడీ ఒనాసిస్, ఎలిజబెత్ టేలర్, లి అయకాక్కా, రాబర్ట్ రెడ్ ఫోర్డ్, విలియమ్ కార్లోస్ విలియమ్స్, ఆర్థర్ మిల్లర్, హెన్రీ కిసింజర్, న్యూయార్క్ మేయర్, వందలాది ఇంటర్నేషనల్ సెలబ్రిటీస్ పాల్గొన్నారు.

షాంపేన్ కాలువల్లా పారింది. వుడే అలెన్ జోక్స్ చెప్పాడు. మిక్ జాగర్ పాటలు పాడాడు. పార్టీ గ్రాండ్ సక్సెస్! దాన్ని గురించి న్యూయార్క్ టైమ్స్‌లో ముఖ్యమైన సోషల్ ఈవెంట్‌గా వ్రాశారు. హాలీవుడ్ ప్రొడ్యూసర్స్, ఆపెరా డైవాలు, స్టార్స్, సూపర్ స్టార్స్, లిటరరీ ప్రపంచంలోనుంఢి నార్మన్ మెయిలర్, సార్ బెల్లో, గ్లోరియా, వాండర్ బిల్ట్, హ్యూ హెఫ్నర్ ఇంకా ఎందరెందరో సెలబ్రటీలు ఆ పార్టీని విజయవంతం చేశారు.

పార్టీ జరుగుతున్నంత సేపూ రాంచంద్ మనసు అక్కడ లేదు. అతడి ప్రారంభ దశలోని స్ట్రగుల్... గట్టి శ్రమ...తనని మోసం చేసిన మనుషులు...తనకి సాయం చేసిన మనుషులు...వ్యాపారంలోని కీలకాలు అర్థం చేసుకున్న దశలో అతడిలో కలిగిన ఉద్వేగం... పగలూ రాత్రి నిద్ర లేకుండా చేసిన ఆలోచనలు చివరికి ఫలితాల్నిచ్చినప్పుడు కలిగిన శాటిస్‌ఫాక్షన్... దెబ్బలు తిన్నప్పుడు కలిగిన మనోవేదన...అంతా డ్రామా...ఆ నాటకంలోని వందలాది పాత్రధారులు తన కళ్ళముందు మారిపోయారు. తన విజయానికి తను చేరిన ఔన్నత్యానికి ఈ పార్టీ ప్రతీక...ఖండ ఖండాల్లో తనకి మిత్రులున్నారు. వాళ్ళు ఫేమస్... పవర్‌ఫుల్...రిచ్...టాలెంటెడ్...పొయెట్స్... నావెలిస్ట్స్...నోబెల్ ప్రైజ్ విన్నర్స్...క్రియేటివ్ ఆర్టిస్ట్స్...





కాని ఇదంతా ఓ స్వప్నం... ఇదంతా కరిగిపోబోతోంది, ఎల్లకాలమూ సాగని ఓ క్షణిక అనుభవం ఇది...ఇలాంటి వాటికి మనం ఎందుకు ప్రాముఖ్యత ఇస్తాము? వీళ్ళకి తెలియదా ఇవన్నీ జరుగుతున్న క్షణాలని...కరుగుతున్న గంటలనీ...పారిపోతున్న రోజులనీ...ఎన్నడూ తరిగి రాని స్మృతులని...కాలంలో కలిసిపోతున్న సంఘటన లనీ...

అందరూ ఎంజాయ్ చేస్తున్నారు. కాని తనిక్కడ లేనేలేడు. తన జీవన స్మృతుల వరదలో కొట్టుకుపోతు న్నాడు. ఎన్నడో జరిగిన సంఘటనల్ని పునరావృత్తం చేస్తున్నాడు. జీవితాన్ని మళ్ళీ జీవిస్తున్నాడు జ్ఞాపకాల్లో... ఎవరెవరో, ఏదో అంటున్నారు. నవ్వుతున్నారు షాంపేన్ చిన్న చిన్న గుక్కలుగా తాగుతున్నారు. తనకే తెలుసు భయంకరమైన నిజం...కొద్ది నెలల్లో తన చావు వ్రాసి వుంది...కాన్సర్ దాని పని అది చేసుకుపోతోంది. ఎలాగో అయిందనిపించి తన ఇంటికి చేరుకున్నాడు రాంచంద్. తెల్లవారు ఝామున మూడుగంటలకి... మార్తా అతడి కోసం ఎదురు చూస్తోంది.

"ఆ పార్టీలలో ఎవరూ సరిగా తిండి తినరని నాకు తెలుసు. మీకు ఇష్టమైన సూప్‌చేశాను" అంది.

"ప్రటా"అన్నాడు.

వేడివేడిగా సూప్ తెచ్చింది బౌల్‌లో. సూప్ తాగి జసన్‌కీ, మార్తాకి గుడ్ నైట్ చెప్పి తన బెడ్‌రూమ్‌ లోకి వెళ్ళాడు రాంచంద్. వీళ్ళ విశ్వాసానికి, ఆపేక్షకి తనెలా బదులివ్వగలడు? తనులేకపోతే వీళ్ళేమైపోతారు. ఆ రూములో అక్కడ గోడలమీద పికాసో, మెటెస్, డి. మానింగ్, జార్జియా ఓకఫే, ఛగాల్ పెయింటింగ్స్ వేలాడుతున్నాయి. ఆర్ట్ ప్రపంచంలో ఓ జోక్ వుంది. రాంచంద్ కొత్త పెయింటర్స్‌ని ముందే పసిగట్టి చవకలో కొనేస్తాడని...అతడి ఈస్తటిక్ ఐ గురి తప్పనిది...






అయినా ఏం లాభం...ఎవరు చూస్తారీ పెయింటింగ్స్... ఏం చేయాలీ కళాఖండాల్ని...ఎంత భారాన్ని మీదకి తెచ్చుకున్నావ్ రాంచంద్...యూ ఫూల్ అనుకున్నాడు.

మగతగా నిద్రపోయాడు టక్సెడోతోనే...కలలు నిండిన నిద్ర.

ఎక్కడ కల ప్రారంభమయిందో, ఎక్కడ జీవితం అంతమయిందో తెలియని అనుభవం.

ఏవి కలలు? ఏవి నిజాలు?

ఉదయం లేచి రెడీ అయేసరికి నిర్ణయించుకున్నాడు. కొన్ని ముఖ్యమైన డెసిషన్స్ తీసుకోవలసిన సమయం వచ్చిందని...జటిలమైన సమస్యల్ని పరిష్కరించాలి... అన్ని వ్యవహారాలు చక్కబెట్టాలి...తన జీవిత. చరమ దశలో ఓ ఆర్డర్ తీసుకురావాలి...తన జీవతంతో ముడి పడివున్న వేలాది వర్కర్స్‌కి ఓ దారి చూపించాలి. వారి జీవితాలతో తాను చెలగాటమాడలేదు. అంతా సవ్యంగా చేసి కంటిన్యూయిటీ వుండేలా...తన స్టాక్ హోల్డర్స్‌కి ఏమాత్రం నష్టం కలగకుండా...తన ఎంప్లాయీస్‌కి ఏమాత్రం అన్యాయం జరక్కుండా అంతా అరేంజ్ చెయ్యాలి.

తొమ్మిది గంటలకల్లా శ్రీధర్ వచ్చాడు, ఆపరేషన్‌కి ఓ తేదీ నిర్ణయించడానికి . ఇద్దరూ కూర్చుని కాఫీ త్రాగుతుండగా రాంచంద్ అన్నాడు.

"బాబూ! నీవంటే నేనెంతో గర్విస్తున్నాను, నీ నిర్ణయమే కరక్టని నాకు అర్థమయింది. నీ జీవితానికి నాకు తెలిసిన ఎన్నో జీవితాలకన్నా ముఖ్యమైన వర్షిప్ వుంది. నిన్ను మెచ్చుకుంటున్నాను శ్రీధర్. హృదయ పూర్తిగా నిన్ను, నీ కుంటుంబాన్ని ఆశీర్వదిస్తున్నాను బాబూ."

శ్రీధర్ కళ్ళు ఆనందంతో మెరిశాయి.

"ఓ డాడీ! థాంక్యూ వెరీమచ్! ఈ క్షణం నాకెంతో విలువైనది. నా ఆనందాన్ని మీకు ఎలా వెల్లడించాలో నాకు తెలియడంలేదు. నేను పడ్డ శ్రమకి ఈనాడు ఫలితం లభించింది. అందరి మెప్పుకన్నా నాకు కావలసింది మీ ఆశీర్వాదం". అతడి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. కంట్రోల్ చేసుకున్నాడు.

"డాడీ నేను వచ్చింది మిమ్మల్ని మేయో క్లినిక్‌కి తీసుకెళ్ళడానికి. ఎప్పాయింట్‌మెంట్‌కి లేట్ అవుతుంది. కాథరిన్ అక్కడ మన కోసం ఎదురుచూస్తూ వుంటుంది. లెట్స్ గో, ఆపరేషన్‌కి అన్నీ ఎరేంజ్ చేశాము. మీరేమీ వర్రీ పడనవసరం లేదు" అన్నాడు.

రాంచంద్ నవ్వాడు.

"బాబూ నేను దేని గురించి వర్రీ అవడం లేదు. నేను నీకో విషయం చెప్పాలనుకుంటున్నాను. కూర్చో" అన్నాడు. శ్రీధర్ వాచ్ వంకకు చూస్తూ కూర్చున్నాడు నిరాసక్తంగా.

"ఏమిటి డాడీ."

"భవిష్యత్ గురించి నీ ప్లాన్స్ ఏమిటి శ్రీధర్. నీవు ఇక్కడే సెటిల్ అవుదామనుకుంటున్నావా? లేకపోతే ఇండియా వచ్చి అక్కడ సెటిల్ అవుదామను కుంటున్నావా?"

"అదా? నేనూ, కాథరిన్ బాగా చర్చించాము డాడీ, ఇక్కడ మరో రెండేళ్ళుండి ఆ తర్వాత ఇండియాకి వచ్చి అక్కడే పర్మనెంట్‌గా సెటిల్ అవుదామని. పిల్లలింకా చిన్నవాళ్ళు. వాళ్ళు పెరిగి అమెరికన్ జీవితపు ప్రలోభాలకి, స్పీడ్‌కి అలవాటు కాకముందే ఇక్కడినుంచి వాళ్ళను తీసుకెళ్ళదామని మేము నిర్ణయించుకున్నాము. ఇక్కడి లగ్జరీ...ఇక్కడి ప్రాస్పెరిటీ...ఫాస్ట్ కార్స్... ఫాస్ట్ లైఫ్‌కి వాళ్ళని దూరంగా వుంచుదామని నిర్ణయించుకున్నాము. జీవితంలోని నిజాల్ని అర్థంచేసుకునేలాగా... కాంప్లెక్సిటీ వాళ్ళకర్థమయేలాగా...నిబ్బరంగా ధైర్యంగా ఎదుర్కొనేలాగా పెంచాలని మా కోరిక. అది కేవలం మన దేశంలోనే సాధ్యం. రెండేళ్ళ తర్వాత ఇండియా వెళ్ళి అక్కడ ఏదైనా ట్రైబల్ బెల్ట్‌లోనో బాక్వర్డ్ ఏరియాలోనో ప్రాక్టీస్ పెట్టాలని మా అభిలాష...మా కనిష్ట అవసరాలకి సరిపడే సంపాదన వస్తే చాలు. మందులకీ...మెడికల్ ఎక్విప్‌మెంట్ ఇక్కడనుండే తీసుకువెళతాము. మీకు తెలుసు మా అవసరాలు చాలా సామాన్యం. సింపుల్ లైఫ్. ఏమాత్రం ప్రాబ్లెమ్స్ లేకపోవచ్చు ఏమంటారు?"

ఇక్కడ నిశ్శబ్దం. మందమైన నిశ్శబ్దం. రాంచంద్ చిరునవ్వు నవ్వేడు.

"నాదొక ప్రపోజల్ వుంది శ్రీధర్. నీవు అంగీకరిస్తానంటే నేను చెబుతాను."

"ఏమిటది డాడీ?"

"నా డబ్బంతా...నీకూ, నీభార్యకీ రాస్తాను. అది కొన్ని బిలియన్స్‌లో వుంటుంది. ప్రపంచంలో ఎన్నో దేశాల్లో నా పరిశ్రమలున్నాయని నీకు తెలుసు. ఆ డబ్బుతో నీవు ప్రపంచంలోని పేద ప్రాంతాల్లో హాస్పిటల్స్ కట్టి రోగిస్టులకి సేవచేయండి. మీకు నచ్చిన విధంగా ఖర్చు చేయండి."

చాలాసేపు శ్రీధర్ ఏమీ మాట్లాడలేదు. ఆలోచనలో వున్నవాడిలా నుదుట అరచేయి పెట్టుకుని ఏమి అనకుండా కొద్ది నిముషాలున్నాడు. చివరికి మెల్లగా




అన్నాడు.

"ఆ ఏర్పాటు లాభం లేదు డాడీ! నేనూ, కాథరిన్ అంత పెద్ద ఆర్గనైజేషన్‌ని కంట్రోలు చేయలేము. మాకు అలాంటి విషయాల్లో అనుభవం లేదు. మేము తప్పులు చేయవచ్చు. దానివల్ల మీ మనసులో వున్న కోరిక తీరదు. మాకు కావలసింది సామాన్య జీవితం...మా పని...మేము మా చేతులతో పనిచేయడంలో పేషేంట్స్‌తో గడపడం వాళ్ళకి ఆరోగ్యం ఇవ్వగలిగితే వచ్చే సంతోషం మాకు కావాలి. నీ సంపదని మేము హేండిల్ చేయలేము. మా సమర్థతకి మించిన బాధ్యత అది. మేము సక్రమంగా ఆ బాధ్యతను నిర్వహించలేమని నా నమ్మకం. తెలియని వాటిల్లోకి వేలు పెట్టడం నాకిష్టంలేదు డాడీ. కాని మీకు ఓ సలహా ఇవ్వగలను. మీ మిత్రులు నోబెల్ విన్నర్స్, ఇతర సహృదయులు వాళ్ళందర్నీ బోర్డ్ మెంబర్స్‌గా ఓ ఛారిటబుల్ ట్రస్ట్, ఫౌండేషన్ ఏర్పాటు చేయండి. దానిని ఎలా నడపాలో మీరే నిర్ణయించి వారికి తెలిపితే మీ ఇష్టాలకి అనుగుణంగా వారు నడుపుతారు. దానివల్ల మీ ఆశయం నెరవేరే అవకాశం వుంది. మాకు ఆ సంపద నివ్వడంకన్నా ఇది మంచిదని నేననుకుంటున్నాను. మీరేమంటారు డాడీ?"

నిర్మలమైన కళ్ళతో, నిబ్బరంతో, క్లియర్ మైండ్‌తో తన అభిప్రాయాన్ని చెప్పిన కొడుకుని చూసి అచ్చెరువొందాడు రాంచంద్.

ఇంత బలీయమైన నమ్మకాలున్నాయి! ఇంత సాధారణమైన జీవన తత్వముంది! రాంచంద్‌ను ఎప్పుడూ ఓ బాధ పీడించేది, తన కొడుకు విషయంలో తాను తప్పుచేసేడేమోనని... అన్యాయం చేశాడేమోనని...ఇప్పుడు జరుగుతున్న సంఘటన అతని ఓ సందేహాన్ని తీర్చింది. ఎదురుగా కూర్చుని వున్న యువకునిలో వయసుకి మించిన జ్ఞాన సంపద వుంది. తనకే జీవిత సత్యాన్ని సరళంగా అర్థమయేలా నిర్మొహమాటంగా చెబుతున్నాడిప్పుడు—జీవితాలెలా జీవించాలో—నిర్ణయాలెలా తీసుకోవాలో వ్యవహారాలెలా నడపాలో! ఓ గాడ్! ఎంత పెద్ద తప్పుచేశావు రాంచంద్ నీవు? జీవిత కాలమంతా తాను సంపాదించిన అనూహ్యమైన అపార సంపదని క్షణంలో ఎడం కాలితో తన్నేసిన యువకుడు! తను వృథా చేసిన జీవితం మరి తరిగి రాదు. ఈ వెల్త్ ఎవరికీ అక్కర్లేదు! ఇదంతా ఏమౌతుందో ఎవరికీ తెలీదు. ఇంతకీ ఏమైపోతుంది ఈ అపారమైన ధన సంపద?

ఫార్చ్యూన్ మేగజైన్‌లో ఓ సారి ఓ వ్యాసం చదివాడు. అందులో అపార ధనవంతుల కుటుంబాల్లో ఏం జరుగుతుందో ఓ జర్నలిస్ట్ వ్రాశాడు. ఆ వ్యాసం ప్రకారం సూపర్ రిచ్ కుటుంబం మూడో తరం వచ్చేసింది. జీవితంలో ఛాలెంజ్ లేకపోవడం వల్ల వచ్చే అనర్థాల్ని చక్కగా వర్ణించాడు. ఉదాహరణగా కొన్ని అమెరికన్ మిలియనీర్ కుటుంబాల్ని తీసుకున్నాడు. తేలిందేమిటంటే హద్దూ పద్దూ లేని సంపదవల్ల వచ్చే సెక్యూరిటీతో జీవితంలో సగం ఇచ్చ చచ్చిపోతుందనీ, ఏ సమస్యలూ ఎదురుపడక, కష్టాలంటే ఏమిటో అసలు తెలి

యక దుర్బలమైన పౌరులుగా, ఒక సెంట్ జెనరేషన్ తయారవుతున్నారని, డ్రగ్ ఎడిక్ట్స్, ఆల్కహాలిక్స్, స్లేటోటోన్‌గా తయారయి జెట్ సెటింగ్ జీవితాలతో అర్ధాంతరంగా ముప్ఫయి ఏళ్ళు దాటకుండానే మరణిస్తున్నారనీ, చాలామంది సైకలాజికల్ కేసులుగా తయారయి తమకీ, ఇతరులకుకూడా సమస్యలుగా పరిణమిస్తున్నారనీ...అందువల్ల అపార సంపద తరువాతి తరాలవారు వదలడంతో ఏమాత్రం ఔచిత్యం లేదని వ్యక్తులుగా తమ వారసులు అభివృద్ధి చెందాలంటే, వారికి లిమిటెడ్ వెల్త్‌మాత్రమే ఇవ్వడం మంచిదనీ... వారి చదువు సంధ్యలకీ పొట్టి సెక్యూరిటీ వుండేలా ధనం వదిలితే చాలని తేల్చారు. చాలామంది ఇంటర్వ్యూ చేసిన మిలియనీర్ దంపతులు ఈ అభిప్రాయంతో ఏకీభవించారు. ఆ వ్యాసం చదివినప్పుడు రాంచంద్ అంతగా పట్టించుకోలేదు. అంతా నాన్సెన్స్‌అని తీసిపారేశాడు. ఏవో కొద్దిమంది విషయంలో అది నిజం అయివుండవచ్చు. అంతే కాని, అది విశ్వన్యాయంలా స్వీకరించడంలో అర్థం లేకపోవచ్చని తోచింది అతడికి.

ఇప్పుడు తేలిందేమిటి?

నాకొడుకుకి అలాంటి జీవితం సంక్రమించబోవడం లేదు. తాగుబోతుగా...డ్రగ్ ఎడిక్ట్‌గా అయే అవకాశం లేదు...ఎంతో గర్వంగా ఫీలయ్యాడు., భగవంతుడా నీకు నా ధన్యవాదాలు అనుకున్నాడు. జీవితంలో ఏ దేవుళ్లకీ అతడు తల వంచలేదు అంతకుమ్ముందు. ఆ క్షణంలో తెలియని అనంతశక్తికి తన మేధస్సుతో అభివాదం చేశాడు.

"వెల్ డాడీ లెట్స్ గో, లేటవుతోంది" అన్నాడు శ్రీధర్ వాచ్ వంకకు చూస్తూ. లేచి నిలబడ్డారు.

ప్రేమతో తనివితీరా కొడుకును చూస్తూ రాంచంద్ అన్నాడు.

"కూర్చో శ్రీధర్. నేను చెప్పవలసింది ఇంకా పూర్తికాలేదు."

"లెట్స్‌గో డాడీ ప్లీజ్ ఎపాయింట్‌మెంట్‌కి లేట్ అవుతోంది".

## జలపాతం

వేళ్ళ కదపని వీణలా
ఈ కొండ మూగది
దారులు వెదుక్కొని
వేళ్ళు కొసవించి
ఊబికి దూకే రాగంలా
సెలయేరు స్ఫురిస్తోంది
ఏ అలౌకికానుభూతుల్లోకో
పరిప్లవించే రాగంలానే
ఏ లోయల్లోనో
పడి కొట్టుకుపోతో

— ఎస్.ఎ.రవూఫ్

"బాబూ నామాట విను-కూర్చో. నేను చెప్పేది జాగ్రత్తగా విను."

శ్రీధర్ కూర్చున్నాడు. కాని, అతని మనసు అక్కడ లేదు. కాథరిన్, ఇతర డాక్టర్లు హాస్పిటల్లో వెయిట్ చేస్తుంటారు. అనవసరంగా ఆలస్యమై పోతోంది. మళ్ళీ డాడీ తన మాట నెగ్గించుకుందామనే తాపత్రయంతో ఆస్తిని తాను తీసుకోవాలని, తనకి నచ్చ చెప్పాలనే ప్రయత్నం చేస్తున్నారు. అది లాభంలేదని ఎలా ఆయనకి అర్థమయేలా చెప్పడం? ఇన్ పేషంట్‌గా వాచ్ వంకకు చూసుకున్నాడు. మైగాడ్!!

"శ్రీధర్! నా జీవితాన్ని నేను ఓ యుద్ధప్రాతిపదిక మీద క్రమశిక్షణతో నడిపాను. వ్యక్తులతో, సంస్థలతో యుద్ధాలు చేశాను.. కొన్ని నేను ఓడిపోయాను...చాలా సార్లు విజయం సాధించాను. కాని నా పోరాట విధానాన్ని మాత్రం మార్చుకోలేదు. మార్చుకోవలసిన అవసరం నాకెన్నడూ కలగలేదు. నా మనోధైర్యంతో, శ్రమదమాలతో నేనో ఎంపైర్‌ను సృష్టించాను. ఈ పని చేయడం వల్ల నేను మానవాళికి సేవ చేస్తున్నానన్న విశ్వాసంతో చేశాను. నా ఇగోకి శాటిస్‌ఫాక్షన్‌కూడా వచ్చిందన్న విషయాన్ని ఒప్పుకుంటున్నాను. మనుషులు దాచుకోవడానికి, వారి జీవితాలు సుఖంగా వుండటానికి ఎన్నో వస్తువులు తయారుచేశాను. నాణ్యతకి మారుపేరులా వుండే వస్తువుల్ని తయారుచేశాను. ఈ ప్రయత్నంలో ఈ ఆక్షేపణలో నేను ఓ రంగులరాట్నంలో ఇరుక్కుపోయాను. పెరుగుదల ఓ ముఖ్య సూత్రంగా మారి నేను అబ్సెషన్‌తో నాసంస్థలు పెంచాను. ఎన్నో కంపెనీలని కబళించి నా ఎంపైర్ అభివృద్ధి చేశాను. ఆలోచించడానికి నాకు సమయం దొరికేది కాదు. ఫాక్టరీలు కట్టడం, కొత్త పరిశ్రమలు ప్రారంభించడం, ఉన్న వాటిని ఎక్స్‌పాండ్ చేయడం. మెర్జర్స్ ఎరేంజ్ చేయడం, ఈ వ్యాపకాలతో నేను మునిగి తలకిందులయ్యాను ఇన్నేళ్ళూ! పెరిగి పెరిగి ఓ జెయింట్ ఇండస్ట్రియల్ మెగాలిత్‌ని స్థాపించాను.. దీని శాఖలు అన్ని ఖండాల్లో, అన్ని దేశాల్లో వ్యాపించేలా చేశాను. డబ్బు సంపాదించే ఓ పెద్ద మెషిన్‌ని అయిపోయాను. మిలియన్స్...బిలియన్స్...అన్ని కరెన్సీలల్లో సంపాదించాను. అలా సంపాదిస్తూ నా బాలెన్స్ షీట్స్...బ్యాంక్ ఎకౌంట్స్...ఆర్ట్ కలెక్షన్స్ చూస్తూ ఎంతో థ్రిల్ పొందేవాణ్ణి. కాని ఇప్పుడు తెలిసిన చేదు నిజమేమిటంటే ప్రయాణం అంతం కాబోతోంది. ఆట అయిపోయింది! గేమ్ ఈజ్ ఓవర్!! ఇప్పటికే నేను డెబ్బయి రెండేళ్ళు బ్రతికాను. ఒకే ధ్యేయంతో ఇన్నాళ్ళూ జీవించాను. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే సామాన్య మానవుల విలువల ప్రకారం నేను ఎంతో సాధించాను. చాలామంది మనుషుల కన్నా ఎంతో సేవ చేశాను. ఇప్పుడు నా జీవితంలో వ్యర్థత నాకు అర్థమౌతోంది. నేను ఆడిన ఆటంతా తమాషా అనీ...వృధా అని తోస్తోంది. నేను చావబోతున్నాను. నాసంపద ఏమి అవబోతోందో నాకు తెలియదు. ఇది కూడబెట్టడానికి నేను దాదాపు యాభై అయిదు ఏళ్ళు నా జీవితాన్ని ఖర్చుపెట్టాను. ఇప్పుడే నాకు తెలిసింది జీవితాల్ని ఎవరికి నచ్చిన విధంగా వారు మలుచుకోవాలని. ఇతరుల మెప్పు కోసం...ఇతరుల ఆశలు తీర్చటానికి కాకూడదని. నీవు నీ జీవితాన్ని చక్కగా మలుచుకున్నావు శ్రీధర్. అందుకు నేను గర్వపడుతున్నాను. ఆ ఫీల్డ్‌లో నీవు ఎన్నో ఉన్నత శిఖరాల్ని అధిగమిస్తావు. వేలాది లక్షలాది మందికి ప్రాణాల్ని ప్రసాదిస్తారు మీ దంపతులిద్దరూ.

నా చివరి నిర్ణయమేమిటంటే ఇది. ఈ పండిపోయిన జీవితాన్ని పొడిగించడంలో అర్థంలేదు. నీ ఆపరేషన్ వల్ల నేను మరి కొన్నేళ్ళు బ్రతికే అవకాశం వుంది. ఈ ముసలి చెట్టు కూలిపోక తప్పదు. నా నీడ నుండి బయటపడి బాగా ఏపుగా ఇంకా ఎన్నో వృక్షాలు పెరగాలి. ఆ చెట్లు మనుషులకి పువ్వులు, ఫలాలు, నీడ ఇవ్వాలి. అందుచేత నేను ఆపరేషన్ చేయించుకోనవసరం లేదని నిర్ణయించుకున్నాను. అదేకాదు, నీ చేతితో ఆపరేషన్



ఇటీవల విజయనగరంలో విజయభావన నిర్వహించిన క్రాంతి కవితా సదస్సులో పాల్గొని స్వీయ కవితా పఠనం చేసిన కుమారి వై. పద్మలత, కుమారి ఎస్. రుక్మిణి, శ్రీ డి.ఎస్.ఎస్.వి. సుబ్బారావు, శ్రీ ధవళ శివరావ్. మధ్య వున్నది సదస్సు అధ్యక్షులు శ్రీ ఎస్.వి.ఆర్.ఎం. రాజు

చేయించుకోవడానికి నాకు అర్హత లేదు. నిన్ను డాక్టర్‌ని కాకుండా చేయడానికి నేను ఎంత ప్రయత్నించానో నీకూ, నాకూ తెలుసు. అందువల్లనే మనకి 25 ఏళ్ళ ఎడబాటు కలిగింది. దానికి తప్పు నాదేనని తెలిసింది. నీవు సుఖంగా, ఆనందంగా వున్నావని తెలుసుకున్న తృప్తితో నేను జీవితాన్ని చాలిస్తాను బాబూ'' అన్నాడు రాంచంద్.

శ్రీధర్ ఒక్క ఉదుటున తండ్రిని కౌగలించుకున్నాడు. అతడి కళ్ళనుంచి ధారాపాతంగా కన్నీళ్ళు కారుతున్నాయి.

"ఓ డాడీ, డాడీ, డాడీ! నన్ను క్షమించండి. మిమ్మల్ని బాధించాలని నేనలా ప్రవర్తించలేదు.''

కొడుకు భుజంమీద తడుతూ అన్నాడు రాంచంద్.

"నాకు తెలుసు బాబూ. మనలో ప్రేమ వాత్సల్యాలకి కొరత లేదు. జీవితంమీద మనకి వున్నవి రెండు విభిన్న అభిప్రాయాలు. టూ డిఫరెంట్ పాయింట్స్ ఆఫ్ వ్యూ నీవు బాధపడకు.''

"డాడీ మీ నిర్ణయాన్ని మార్చుకోండి. మీరు నూరేళ్ళుండాలి. పదండి హాస్పిటల్‌కి'' తన చేతులతో తండ్రిని పైకి లేపబోయాడు.

"నో శ్రీధర్'' అన్నాడు రాంచంద్. ఆ కంఠంలోని భావం తన నిర్ణయంలో మార్పు వచ్చే అవకాశం ఏమాత్రం లేదని సూచించింది.

శ్రీధర్ తండ్రివంక చూస్తూ వుండిపోయాడు, అసహాయంగా అతడి కళ్ళు నీళ్ళు చిమ్మి అంతా అస్పష్టంగా కనపడింది.

"ఏమీ నష్టం కలగలేదు శ్రీధర్. నీవు డాక్టర్‌వి. నీకు జీవితంలోని రహస్యాలు తెలుసు. జీవులకు, ప్రాణానికి వున్న సంబంధం తెలుసు. నిబ్బరంగా వుండు. మనుషులు హుందా తప్పి ప్రవర్తిస్తే నేను సహించలేను. టేకిట్ ఈజీ! నాకు నచ్చినవిధంగా నేను బ్రతికాను. నీవు కూడా నీవు నమ్మిన సిద్ధాంతాల కోసం ఎన్నో యుద్ధాలు చేయబోతావు. అన్యాయాన్ని ఎదుర్కొంటావు. వాటికి కావలసిన శక్తి, ఓర్పు, పట్టుదల అన్నీ నీలో వున్నాయి. నాకు మాత్రం రెస్ట్ కావాలి. నేను ఎదురుచూడడానికి ఈ లోకంలో ఏదీలేదు. ఇప్పటికి జ్ఞానోదయమయింది. కాబట్టి ప్రకృతి దాని విధి ప్రకారం పనిచేసుకోనివ్వడంలో న్యాయముంది. నేనెవర్ణి కాలగతిని ఆపడానికి? నేను ఇండియా వెంటనే తిరిగి వెళ్ళి ఎన్నో ఎరేంజ్‌మెంట్స్ చేయాలి...చక్కబెట్టడానికి ఎన్నో ఎన్నో పనులు వున్నాయి'' నిట్టూర్చాడు రాంచంద్.

శ్రీధర్‌కి అర్థమైంది ప్రపంచంలోని ఏ శక్తి తన తండ్రి నిర్ణయం మార్చలేదని.

ఎయిర్‌పోర్ట్‌లో వీడ్కోలు-

ఫార్మల్‌గా జరిగిపోయింది. పిల్లలు కేరింతలుకొట్టారు. వాళ్ళకి లభించిన కొత్త బొమ్మలలో...టాయ్స్...పుస్తకాలు...కాథరిన్ ఏమీ అనకుండా వూరుకుంది. శ్రీధర్ ఏదో ఆలోచనలో వున్నవాడిలా కనిపించాడు. కపూర్‌కి, జేసన్ మార్టాలకి బాస్ ప్రవర్తన కలతచెందినవాడిలా ఏమీ అర్థంకాలేదు.



ఇటీవల కోవెలకుంట్లలో కళాకుముద్వతి సంస్థ మూకాభినయ కళాకారుడు శ్రీ కళాధర్‌ను సన్మానించిన దృశ్యం. సంస్థ అధ్యక్షులు శ్రీ జి. రామిరెడ్డి, కార్యదర్శి శ్రీ గోపాలరాజు, ఇతర నిర్వాహకులు వేదికపై వున్నారు.

రాకరాక వచ్చిన బాస్ అర్థాంతరంగా హాలీడే మధ్యలో వెళ్ళడం వాళ్ళకి అసమంజసంగా తోచింది. ఏదో కారణం ఉండివుంటుందిలే అని సరిపెట్టుకున్నారు. అదేదో తెలుసుకోవాలని అడిగే ధైర్యం ఎవరికీ లేదు. ఇన్నేళ్ళు సేవ చేశాక వారికిరాంచంద్ మనస్తత్వం కరతలామలకం.

శ్రీధర్‌ని డాక్టర్ కోల్మన్ అడిగాడు తరువాత ఆపరేషన్ గురించి. ఏదో సమాధానం చెప్పి తప్పించుకున్నాడు శ్రీధర్. ఇండియాలోనే ఆపరేట్ చేయడానికి నిర్ణయించాడని...అడగకుండా ఇంకా ఇతర బిజినెస్ అవసరాలవల్ల అకస్మాత్తుగా స్వదేశానికి వెళ్ళవలసి వచ్చిందని వేగ్‌గా చెప్పాడు. పొలైట్‌గా అంతా సవ్యంగానే వుందని చెప్పాడు. తన తండ్రి కోరిక ప్రకారం అలా జరిగిందని...ఇండియాలో కూడా అన్ని ఫెసిలిటీస్ వున్న హాస్పిటల్స్ వున్నాయని...సమర్థులైన డాక్టర్లు వున్నారనీ...కోల్మన్ మరేమీ అనకుండా వూరుకున్నారు.

షెడ్యూలు ప్రకారం జెట్ ప్లేన్ టేకాఫ్ చేసింది. రాంచంద్ ఉత్సుకతతో న్యూయార్క్ స్కైలైన్ వంకకు చూశాడు. వెంటాడే బ్యూటీ, ఆ నగరపు చురుకుతనం, ఆనందం వెదజల్లే దాని వీధుల్లో తిరగే మనుషులు, దాని అండర్ గ్రౌండ్‌లో వుండే నికృష్టజీవులు... తనిక చూడలేదు. హడ్సన్ నది, తర్వాత అట్లాంటిక్ మహాసముద్రం... ఆ నీళ్ళు...అంతులేని నీళ్ళు... తను చూసే ప్రతి చూపు చివరిదే. తన కంటపడే ప్రతి దృశ్యం మనోఫలకంలో ముద్రించబడి తనతో పాటు తెలియని లోకాలలోకి వెళ్ళిపోతాయి. హోస్టెస్ ఇచ్చిన ఫ్రూట్ జ్యూస్ సిప్ చేస్తూ పర్సనల్ జెట్ పానల్ మీద ఎదురుగావున్న ప్రపంచ పటంకేసి చూశాడు. ఆ మ్యాప్ మీద బటన్లు వున్నాయి... కొద్దిరోజుల్లో వాటికి అర్థం వుండదు. తన శరీరానికి సంబంధించినంత వరకు అవి తమ కర్తవ్యాన్ని కోల్పోతాయి.

కాన్సర్ కణాలు వృద్ధిచెందుతున్నాయి. ఈ శరీరపు మెషిన్ చెడిపోతోంది. రిపేరు చేయటానికి అసాధ్యమయే దిశగా నాశనం జరిగిపోతోంది. నిర్దయగా ప్రకృతి తన పని చేసుకుపోతోంది. తనని జెట్ ఇండియాకి లాస్ట్ ట్రిప్‌మీద తీసుకుపోతోంది. అక్కడినుండి కొద్ది నెలల్లో అతడు తిరిగిరాని లాస్ట్ ట్రిప్ మీద పర్మనెంటుగా వెళ్ళిపోతాడు. తనకి విధేయత చూపి ఆదరించిన మనుషులకి ఋణం తీరేలా ఏర్పాటుచేయాలి. తనకి ఎవరైనా శత్రువులుంటే వారందరిని క్షమించాలి. మిత్రత్వం, శత్రుత్వం అర్థంలేని మానవానుభూతులు. ఈ సమయంలో తనువాటికి అతీతుడు.

రాంచంద్ కళ్ళుమూసుకున్నాడు... కలలు కంటున్నాడు. జెట్ పోతోంది ఇండియా దిశగా.

## చప్పుడు

చెలీ!
నిను బలవంతంగా
నా తలపుల్నించి
నెట్టేస్తున్నప్పుడు -
మొగ్గను చిదిమినా
ఆగిపోని పరిమళపు పాట
నా మనసును కోస్తున్నప్పుడు -
ఆకాశంలో
హరివిల్లు విరిగిన
చప్పుడు!

- 'లలిత శ్రీ'

సమాప్తం